www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 14 | జూన్ | 2025
పేజీలు : 8

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అనుదీప్ దురిశెట్టి ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టిని అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, డిఆర్‌వో పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



# అంపశయ్యపై ప్రభుత్వ విద్య..!

- ఈ దుస్థితికి కారకులెవరు...?
- ప్రభుత్వమా.. ఉపాధ్యాయులా..?
- ప్రైవేటుపై తల్లిదండ్రుల మోజు
- ఆ పాఠశాలలో ఉపాధ్యాయులే.. విద్యార్థులేరి

2లో

**ప్రభుత్వ విద్య అత్యంత పతన దశకు చేరుకుంది. వందలాది మంది విద్యార్థులతో అలరారిన ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు కనిష్ట అంకెను లేదంటే సంఖ్యకు చేరుకున్నాయి.** వందలాది మంది విద్యార్థులు ఉన్న ప్రైవేటు పాఠశాలలు గొప్ప డిగ్రీలు, విశేష అనుభవం, ఉత్తమ అవార్డులు అందుకుని బోధన చేసే సిబ్బంది ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడం చూసి పక్కున నవ్వుతున్నాయి. (నవ్విన ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదనుకోండి) వేలు, వందల ఓట్లు కలిగిన గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఒకరిద్దరు పిల్లలున్నారు. ఉన్నత స్థానాల్లో ఉండి అందుకు తగినట్లు వేతనాలు పొందుతూ పండితాగ్రెసులు బడిబాట పేరుతో మీ పిల్లలను మా బడికి పంపండి అంటే పంపక పోగా నిలదీస్తున్న తీరు ఆలోచింపజేస్తుంది. అదే సమయంలో హైస్కూల్ విద్యను కూడా పూర్తి చేయని నాలుగు అంకెల వేతనం సరిగ్గా పొందని వారు మీ పిల్లలను మా బడికి పంపండి అంటే తల్లిదండ్రులు సానుకూలంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల దుస్థితికి కారణం ఎవరు ప్రభుత్వమా.. ప్రభుత్వ ఉపాధ్యాయులా..

-ప్రజాపక్షం/ఖమ్మం

## రైతు భరోసాకు 54 ఎకరాల పరిమితి



**ప్రజాపక్షం/ఖమ్మం :** రైతు భరోసాకు గత చట్టాలను , నిబంధనలను పరిశీలించిన మీదట 54 ఎకరాల వరకు రైతు భరోసా అందించనున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా మొత్తాన్ని ఈ నెలాఖరు లోపు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమం సందర్భంగా మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ, సామాజిక, వ్యవసాయ పరిస్థితులపై పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ సాగుకు సంబంధించి పలు వివరణలు ఇచ్చారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రైతు భరోసా సాయం పెట్టుబడి కోసమే చేస్తున్నామని పెట్టుబడి సమయంలోనే రైతు భరోసాను అందిస్తామని ఇదే విషయాన్ని ముఖ్యమంత్రితో

**-ఈ నెలాఖరు లోపు రైతుల ఖాతాల్లోకి**
**-సేంద్రియ సాగును పెంపొందించాలి**
**-ఈటల వల్లనే స్పందించాల్సి వచ్చింది**
**-పామాయిల్‌కు ఎంజిపి ఆలోచన**
**-మీడియా చిట్‌చాట్‌లో మంత్రి తుమ్మల**

చర్చించినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ రంగంలో రసాయనాల వాడకం ముఖ్యంగా యూరియా వాడకం పెరిగి పోతుందని దీనిని తగ్గించాలని ఆయన తెలిపారు. ఒక్క యూరియాపైనే రూ. 1.70 లక్షల కోట్లు సబ్సిడీ ఇస్తుందని కాంప్లెక్స్ ఎరువులకు సబ్సిడీని అందించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తుమ్మల తెలిపారు. వ్యవసాయం

మిగతా 2లో..

## ఆదరణ అంతంత మాత్రమే..






**-మసకబారుతున్న గిరిజన సహకారం సంస్థ**
**- అటవీ ఉత్పత్తులు కొనుగోళ్లు అంతంత మాత్రమే**
**- చతికల పడుతున్న లక్ష్యాలు, ఆమోదాలు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజన సహకార సంస్థ (జిసిసి) నానాటికీ ఆదరణ కోల్పోతోంది. ఆకప్పటి వైభవం నేడు కానరాకపోవడంతో పరిస్థితులు ఆశాజనకంగా లేవు. కొనుగోళ్లు, అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండటంతోఆ సంస్థ క్రమంగా ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడింది. రాష్ట్ర విభజనలో అటవీ ఉత్పత్తులు పెద్ద ఎత్తున లభ్యమయ్యే విఆర్ పురం, చింతూరు, కూనవరం మండలాలు ఏపిలో విలీనం కావడంతో

మిగతా 2లో..

# అంపశయ్యపై ప్రభుత్వ విద్య..!

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ పాఠశాలలు అత్యంత గడ్డుస్థితిని ఎదుర్కొంటున్నాయి. మౌలిక వసతులు, అర్హత కలిగిన బోధనా సిబ్బంది, విద్యార్థులు లేక బోసిపోతున్నాయి. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ బడిలో ఒక విద్యార్థి లేకపోగా నాలుగు ప్రైవేటు పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులు ఆ ఊరిలో రయ్ రయ్ మంటున్నాయి. ప్రభుత్వబోధనకు పెద్ద మొత్తంలో వేతనం ఇస్తున్నా విద్యార్థులను ఆకర్షించ లేని ఉపాధ్యాయులు పిల్లలు రాకుంటే బాగు రోడ్డు సమీపంలోని పాఠశాలకు డిప్యూటేషన్ వెళ్లవచ్చు అన్న భావనలో ఉన్నారంటే అంకిత భావం ఏ స్థాయిలో ఉందో ఆలోచించుకోవచ్చు. ఖమ్మంజిల్లా వైరా మండలంలోని అష్ణగుర్తి గ్రామం ఒకప్పుడు విద్యా కేంద్రంగా ఉండేది. చుట్టూ పది గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆ గ్రామానికి వచ్చి పదవ తరగతి వరకు చదువుకునే వారు. ఎంతో మందిని ఉన్నతవంతులుగా తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేర్చింది. ఆ గ్రామ ఉన్నత పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులను నిత్యం స్మరించే వారు ఇప్పటికీ ఉన్నారు. ఆ గ్రామం ఉన్నత పాఠశాల కొన్నేళ్ల క్రితం విద్యార్థులు లేక రాక మూత పడింది. ఇప్పుడు ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల ఆ పాఠశాలకే చెందిన ఒక ఉపాధ్యాయుడు అనుమతి లేకుండానే విదేశాలకు వెళ్లి ఎంజాయ్ చేసి అధికారులకు దొరికి అపకీర్తి కూడబెట్టారు. ఆ ముగ్గురు ఒకరికి ఎదురుగా ఒకరు కూర్చుని బడికి రాకపోతే జీతం వస్తే విద్యార్థులు లేరు ఏమిటి దుస్థితి అని ఆలోచన చేస్తున్నారు. ఇది ఈ ఒక్క పాఠశాల దుస్థితి కాదు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది పాఠశాలలు మూసివేత దిశగా సాగుతున్నాయి.

### ప్రభుత్వ వైఫల్యమే దుస్థితికి కారణం...

బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నాం, వేతనాలు ఇస్తున్నాం ఊరిలో వారు అడిగితే పాఠశాల భవనాలు కడుతున్నాం, వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం అనుకుంటుంది తప్ప పర్యవేక్షణ లేదు. మండల విద్యాశాఖాధికారులను నియమించామా, ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారా, చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారా అని ఆలోచించారా, ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లు ప్రభుత్వం వ్యవహరించింది. అత్యంత వేతనాలు ఇస్తున్నప్పుడు విద్యార్థుల సంఖ్య తగ్గడానికి లేకపోవడానికి ఉపాధ్యాయులను ఎందుకు బాధ్యులను చేయరు. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్న నిబంధన ఎందుకు తీసుకు రారు అన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. గతంలో ఉపాధ్యాయుల పిల్లలు వారు పని చేస్తున్న పాఠశాలల్లోనే చదివే వారు. దాని వల్ల ఉపాధ్యాయులు పనిచేస్తున్న చోటే నివసించే వారు. మరి ఇప్పుడు ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్యం వెరసి ప్రభుత్వ విద్య పతనానికి కారణమైంది.




### హక్కులు తప్ప..
### బాధ్యతల గురించి ఆలోచించని ఉపాధ్యాయులు...

ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడాడేందుకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ సంఘాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ హక్కుల గురించి మాత్రమే మాట్లాడే నేతలు బాధ్యతల గురించి పెద్దగా మాట్లాడారు. ఈ తరంలోని కొందరు బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం రేపటి ప్రభుత్వ ఉపాధ్యాయ తరాన్నే లేకుండా చేస్తుందన్న ఆలోచన రాకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వ బడులే లేనప్పుడు ఉపాధ్యాయులను ఎలా నియమిస్తారు అన్న ప్రశ్న మదిలోకి రావడం లేదా లేక మా తర్వాత ఎవరు ఏమైతేనేమి అన్న భావన అన్నది అర్థం కావడం లేదు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు నినదించడం కాకుండా చేపట్టిన కార్యాచరణ ఏది. ఏ ఉపాధ్యాయ సంఘానికి చెందిన సభ్యులు ఎక్కువ మంది విద్యార్థులను బడిలో చేర్చారు. ఏ ఉపాధ్యాయ సంఘం నేత పనిచేస్తున్న ప్రభుత్వ బడి పదిలంగా ఉంది. వేసవిలో ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వ బడుల పరిరక్షణ ఉద్యమాన్ని ఎందుకు చేపట్టరు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలకు ఎందుకు డిమాండ్ చేయరు. ఒక వ్యవస్థలో పనిచేస్తున్న వారిని కాపాడేందుకు ఏర్పడిన సంఘాలు ఆ వ్యవస్థ కనుమరుగవుతున్న స్పందించకపోవడం శోచనీయం. ఇదే సమయంలో తల్లిదండ్రులకు ప్రైవేటుపై మోజు పెరిగింది. పిల్లల చదువు కోసం ఆస్తులు అమ్మాల్సి వచ్చినా వెనకాడడం లేదు. రుగ్మతగా మారిన దీనిని కూడా రూపుమాల్సింది ఉపాధ్యాయులే. ఉపాధ్యాయుడు జ్ఞాన జ్యోతి సమాజాన్ని చైతన్యవంతం చేయగల దిట్ట. ఉపాధ్యాయులు ఆ ఆలోచన చేయాలి. ప్రభుత్వం ఏదో ఒక నిబంధన తెచ్చి ప్రభుత్వ విద్యను నిర్బంధం చేయాలి. లేకుంటే ప్రభుత్వ విద్య గతమే.

# ఆదరణ అంతంత మాత్రమే..



(మొదటిపేజీ తరువాయి)
జిసిసికి మరింత శాపంగా మారింది.

### చతికల పడుతున్న సేకరణలు...

జిసిసి అటవీ ఉత్పత్తుల సేకరణపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. జిగురు, ముష్టి గింజలు, చిల్లగింజలు, విప్పపువ్వు, ఉసిరి, ఉసిరిపప్పు, గచ్చకాయలు, గానుగగింజలు, కొండచీపుర్లు, నల్లజీడిగింజలు, చింతపండ్లు, కుంకుళ్లు, తేనె,కరక్కాయలు, నరమామిడి చెక్క లాంటివి గిరిజనులు సహజసిద్ధంగా అడవుల్లో నుండి వీటిని సేకరించి జిల్లాలోని జిసిసి పాయింట్ల వద్దకు తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తుంటారు. కానీ ఇప్పుడు ఆపరిస్థితి ఆశాజనకంగా లేదు. రాష్ట్ర విభజన జరిగిన నాటి నుండి జిగురును కొనుగోలు చేసేందుకు గుత్తేదార్లు ముందుకు రాకపోవడంతో గిరిజనుల నుండి కొనడం మానేసారు. మరో ప్రక్క కోట్లాది రూపాయల విలువచేసే జిగురు గోదాముల్లో మూలుగుతోంది. ఇదిలా ఉండగ దేశవాలీ మార్కెట్‌లో కొన్ని ఉత్పత్తులకు డిమాండ్ తగ్గడం కూడా మరో కారణం. అడవులు అంతరించపోవడం, ఫలసాయాలు అందించే చెట్లు కనుమరుగు కావడం ఇబ్బందిగా మారింది. ప్రధానంగా అడవులపై ఆధారపడి జీవనం సాగిచే గిరిజనులు సేకరించే ఉత్పత్తులే జిసిసికి ప్రధానం వనరు. వారికి ఉపాధి లేకపోవడంతో గిరిజనులు జీవనోపాధికోసం వలసలు పోతుండటం గమనార్హం. ఐటిడిఏ పరిధిలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలకు నిత్యవసరాలు సరఫరాతోనే సరిపట్టుకోవాల్సి వస్తోంది.

### మసక బారుతున్న లక్ష్యాలు, ఆమోదాలు...

జిసిసి వ్యాపార లావేదేవీలు తగ్గిపోవడంతో లక్ష్యాలు చేరుకోలేని పరిస్థితి దాపురించగా వార్షిక ప్రణాళికలు ఆమోదానికి నోచుకోవడం లేదు. 202425 ఆర్థిక సం.కు గానూ 191.72 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకోగా, రూ.113.79 కోట్ల వద్దే చతికలపడ్డారు. 202526 వార్షిక ప్రణాళికలో భాగంగా రూ.150 కోట్లుగా రూపొందించగా, అది నేటికి కూడా ఆమోదం పొందకపోవడం గమనార్హం.

### కానరాని పూర్వవైభవం...

గత వైభవం జిసిసిలో ప్రస్తుతానికి లేదనే చెప్పాలి. భద్రాచలం డివిజన్ పరిధిలో దమ్మపేట, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు బ్రాంచీల్లో వ్యాపార లావాదేవీలు పెరిగితే తప్ప పరిస్థితులు చక్కబడేలా లేదు. మసకబారుతున్న జిసిసిలో జవసత్వాలు నింపేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఆ మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో భాగంగానే వార్షిక ప్రణాళికను ఆమోదించలేదనే వాదన ప్రచారంలో ఉంది.

# రైతు భరోసాకు 54 ఎకరాల పరిమితి

(మొదటిపేజీ తరువాయి)

ఒకప్పుడు స్థానిక అవసరాల కోసమే సాగేదని ఇప్పుడు ఎగుమతి దిశగా ఆలోచనలు సాగుతున్న వేళ జాగ్రత్తలు తీసుకోవాలని పురుగుమందు అవశేషాలు ఉన్న వ్యవసాయోత్పత్తులకు ఎగుమతులు లేవని అందుకే సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలని తుమ్మల రైతాంగానికి సూచించారు. సేంద్రియ సాగుకు ప్రభుత్వం ఊతమిస్తుందన్నారు. పామాయిల్ సాగులో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని ఇప్పటికే 2.54 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారని మరో లక్ష ఎకరాల్లో సాగుకు ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. అన్ని ఉమ్మడి జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయనున్నామని తుమ్మల రైతాంగానికి హామీ ఇచ్చారు ఖమ్మంజిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద ఏర్పాటు చేస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీలో గార్డెన్ సీడ్స్ ఉత్పత్తితో పాటు రీఫైనరీ కూడా అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. పామాయిల్ సాగుకు సంబంధించి విత్తనాల ద్వారా మొలకెత్తించే పద్దతి ఎక్కడ లేదని తొలిసారి ఖమ్మంజిల్లాలోనే తయారు కానున్నాయన్నారు. పామాయిల్ సాగుకు సంబంధించి మినిమం గ్యారెంటీ ప్రైస్ (ఎంజిపి) కల్పించేందుకు దక్షిణాది రాష్ట్రాలతో కలిసి కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నామన్నారు. దిగుమతి సుంకాన్ని తగ్గించేందుకు కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నామన్నారు. నకిలీ విత్తనాలకు సంబంధించి ఎక్కడ ఎవరు విక్రయించినా, సరఫరా చేసినా పిడి యాక్ట్ నమోదు చేస్తామని తుమ్మల హెచ్చరించారు. నకిలీ విత్తనాలు దొరికితే వెంటనే ధ్వంసం చేయాలని సూచించారు.

### ఈటల వల్లనే స్పందించా...

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన కమిషన్ ఎదుట మాజీ మంత్రి ఈటల నా ప్రస్తావన తెచ్చినందునే నేను స్పందించాల్సి వచ్చిందని ఒక ప్రశ్నకు సమాధానంగా తుమ్మల తెలిపారు. అప్పటికి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి మాత్రమే మంత్రి వర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని దానికి 15 రోజుల ముందే కాళేశ్వరానికి అనుమతినిచ్చారని ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు కమిషన్‌కు సమర్పించినట్లు తుమ్మల తెలిపారు. ముఖ్యమంత్రులకు ఇబ్బందులు కలిగించే రీతిలో తాను ఎప్పుడు వ్యవహరించ లేదని తుమ్మల స్పష్టం చేశారు.

# ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం నుండి ఉన్నత చదువులు చదివే బీద విద్యార్థినిలకు కొండబోలు సురేష్ పెద్ద అండ. వారి చదువులకై సురేష్ అందిస్తున్న ప్రోత్సాహం నభూతో నభవ్యితి అలాగే వైరా మండలంలో ఉన్నత పాఠశాల విద్యార్థుల కొండబోలు సురేష్ అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని వైరా మండల వైద్యాధికారి డాక్టర్ బత్తినేని శ్రీహర్ష పేర్కొన్నారు. వైరా మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైరా మండలంలో ఒక్కో ఉన్నత పాఠశాల నుండి పదో తరగతి ఫస్ట్ వచ్చిన అలాగే సెకండ్ వచ్చిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా కొండబోలు సురేష్ వైరా ఉపాధ్యాయులు సూర్యం ద్వారా పంపిన ప్రోత్సాహక నగదును అందజేసేందుకు ఏర్పాటు చేసిన విద్యా ప్రోత్సాహక సభలో వారు మాట్లాడుతూ సురేష్ ప్రోత్సాహాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఆరు వేలు, నాలుగు వేలు చొప్పున మొత్తం 21 మందికి కొండబోలు సురేష్ మొత్తం లక్షా ఇరవై వేలను విద్యార్థులకు అందజేశారు. అలాగే హరి భవ్యశ్రీ అనే బీద విద్యార్థిని ఇంజనీరింగ్ చదువులను సురేష్, కొండబోలు లలిత ప్రతి సంవత్సరం రూ.10వేలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఎన్ఆర్ఐ పేరెంట్స్ మాజీ బాధ్యులు, జిల్లా పిఆర్‌టియు అధ్యక్షులు వైవి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కొండబోలు సురేష్ వైరా మండలంలో పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సమావేశంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.మాధవరావు, డి.సత్యనారాయణ, చావా శ్రీనివాసరావు, సూర్యకుమారి, ఇమ్మానీయేలు, దొడ్డా వరప్రసాద్ పాల్గొన్నారు.

# బలహీన వర్గాలకు ఎర్ర జెండానే అండ

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్**

**-ఘనంగా జూలూరుపాడు, వెంగన్నపాలెం సంయుక్త గ్రామ శాఖ మహాసభ**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిరంతరం ఎర్రజెండా పోరా డుతుందని కార్మిక కర్షక బలహీన వర్గాలకు ఎర్రజెండా అండగా ఉం టుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్య లు చంద్ర నరేంద్ర కుమార్ తెలి పారు. శుక్రవారం స్థానిక ఏవిఆర్ ఫంక్షన్ హాల్‌లో సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు సిరిపురపు వెంకటేశ్వర్లు ఎగరవేశారు. అనంతరం కొండా వీరయ్య, కిలారి ముత్యాలు అధ్యక్షతన జరిగిన గ్రామ శాఖ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల కబంద హస్తాల్లో మగ్గుతున్న భారతదేశానికి విముక్తి కలిగించేందుకు ఆవిర్భవించిన సిపిఐ నాటి నుండి నేటి వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతోందని, నూరేళ్ళ పార్టీగా జనం గుండెల్లో సిపిఐ మహోన్నత స్థానం సంపాదించుకుందని తెలిపారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎర్రజెండా పోరాడుతుందని పేద ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. అనంతరం జూలూరుపాడు వెంగన్నపాలెం నూతన గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాగుల్ మీరా, సిపిఐ నాయకులు ఎల్లంకి మధు, ఎస్‌కే చాంద్ పాషా, గుండె పిన్ని మధుసూదన్‌రావు, చెరుకుమల రాజేశ్వరరావు, కంచర్ల రాఘవేంద్రరావు, అనుమల అశోక్, తాత నరసింహారావు, ఎల్లంకి శ్రీను, తాళ్లూరి లక్ష్మ య్య, ఎలబాక రాంబాబు, కత్తి గోపి, బడుగు వీరస్వామి, బరగడ రమేష్, ఎస్‌కే బొలె మియా, దేవినేని రాము, పత్తిపాటి మహేష్, పసుపులేటి పవన్, ఇంజము శ్రీను, ఎస్‌కే మీరా వాలీ, కొండా హనుమంతరావు, బర్ల ప్రేమమ్మ, సిలం సావిత్రి, కల్లోజి రజిని, చల్లగుండ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**-నాట్ల కంటే ముందే రైతు భరోసా**
**-గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు రావు**
**-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల**







**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అభివృద్ధి పనుల్లో ఖమ్మం ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. రేగులచలక గ్రామం ఎస్సి కాలనీలో రూ. 20 లక్షలతో, రేగులచలకలో రూ. 22.50 లక్షలతో, కోయచలక గ్రామం ఎస్సి కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు, కోయచలక నుండి కామంచికల్ వరకు రూ. 2.50 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కోయచలకలో రూ. 16 లక్షలతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోయచలక ఉన్నత పాఠశాలలో చెరుకూరి పూర్ణచందర్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధి కోసం అందరూ ప్రశాంతంగా కలిసి మెలిసి పని చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో గత పాలకులు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అదనంగా వేల కోట్లు ఖర్చు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజా పాలనకు ప్రకృతి కూడా సహకరిస్తుందని సమృద్ధిగా వర్షాలు పడుతున్నాయని రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారన్నారు. నాట్ల కంటే ముందే రైతుల బ్యాంకుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో రోడ్లు ఇరుకుగా ఉన్నాయని భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని గ్రామస్తులు చర్చించుకుని రోడ్డు విస్తరణకు సహకరిస్తే డబుల్ రోడ్డు వేస్తామన్నారు. మన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావాని మన డబ్బులు మన చేతిలో ఉంటాయని పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోని సుఖంగా ఉండవచ్చునని తెలిపారు. అపరిశుభ్రత వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసిన తర్వాత వాటి నిర్వహణ కూడా పకడ్బందీగా జరగాలన్నారు. రాష్ట్రంలో ఖమ్మంజిల్లాకు మంచి పేరుందని అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రిని ఒప్పించి వందల కోట్లు తీసుకొస్తామని వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అదనంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనుల్లో రాష్ట్రంలోనే మిగిలిన నియోజక వర్గాల కంటే ఖమ్మం ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభివృద్ధి చేస్తున్నారన్నారు. రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి చెరువులకు నీళ్లు నింపడం జరిగిందన్నారు. ఖమ్మంలో వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కోయచలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. చిన్నారుల చేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జెడ్పిసిఈవో దీక్షారైనా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్, ఎంఈవో రాములు, ప్రజాప్రతినిధులు, నాయకులు యండ్లపల్లి సత్యం, మాధంశెట్టి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**
**- సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులకు భూ భారతిపై అవగాహన**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు, కో ఆపరేటివ్ అధికారులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూ భారతి చట్టం తీసుకు వచ్చారని దీని ద్వారా భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై ప్రజలకు అభ్యంతరాలు ఉంటే అప్పీల్ చేసుకునే అవకాశం భూ భారతి చట్టం కల్పించిందన్నారు. తహసీల్దార్ నుంచి సిసిఎల్‌ఏ వరకు అప్పీల్ చేసుకోవచ్చునని, గతంలో సివిల్ కోర్టుల ద్వారా లభించే పరిష్కారం నేడు రెవెన్యూ వ్యవస్థ దగ్గర అందుబాటులో ఉంటుందన్నారు. వారసత్వం, వీలు నామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డులో మ్యూటేషన్ చేస్తారని తెలిపారు. తహసీల్దార్ నిర్ణీత వ్యవధి 30 రోజుల్లోగా విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటారన్నారు. పెండింగ్ సాదాబైనామా సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ భూ భారతి చట్టంపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, డిసిసిబి సిఈఓ వెంకట ఆదిత్య, వరంగల్ తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, కో ఆపరేటివ్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం





**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని ఖమ్మంపాడు యుపిఎస్ పాఠశాల నందు శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1వ తరగతిలో చేరిన విద్యార్థులకు హెచ్‌ఎం ఆర్‌వి సత్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో 105మంది విద్యార్థులు చదువుతున్నారని, బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి తల్లదండ్రులను తమ పిల్లలను బడిలో చేర్పించాలని కోరినట్లు, ఈ సంవత్సరం కూడా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎపిసి చైర్‌పర్సన్ బంక మాణిక్యమ్మ, ఉపాధ్యాయులు జి.రామచంద్రారెడ్డి, ఎండి.జమీర్, వి.లక్ష్మారెడ్డి, లక్ష్మీ ప్రసన్న, కె.సునిత, అంగన్వాడీ టీచర్ పద్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను సన్మానించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న ముజమ్మిల్ ఖాన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సన్మానించారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాలువతో సన్మానించారు. పని చేసిన కొద్ది కాలంలోనే ఖమ్మంజిల్లా ప్రజల ఆదరాభిమానాన్ని చూరగొన్నారని కలెక్టర్‌ను మంత్రి తుమ్మల అభినందించారు.

## సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని గణేశ్వరం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన 12 మంది విద్యార్థుల చేత అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు కావాల్సిన పలకలు, బలపాలను ఖమ్మంకు చెందిన దారా రవికుమార్ తన తండ్రి దారా వైకుంఠరావు జ్ఞాపకార్థం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. దాతల సమకారంతో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు ఎల్. గోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. విజయశ్రీ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుశీల, ఉపాధ్యాయులు రఫీక్‌పాషా, ఎన్. వెంకటేశ్వర్‌రావు, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రాధా, కౌసల్య, ఆయా ప్రియాంక, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి ఎన్ఆర్ఐ ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ఉన్నత విద్యకై విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడ్డ ఎన్నారై కేతినేని అన్వేష్ జన్మనిచ్చిన తల్లి దండ్రులకు, సొంత గ్రామానికి ఏదో ఒక మంచి పని చేయాలని ఆలోచనతో తిరుమలాయపాలెం అంగన్వాడీ కేంద్రానికి తన వంతు సహాయాన్ని అందించారు. చిన్న పిల్లలు స్వచ్ఛమైన చల్లటి తాగునీరు తాగేందుకు సుమారు రూ.10వేలు వ్యయంతో కూల్ వాటర్ ఫ్రిజ్ అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ విప్పల గీత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఉండే చిన్న పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా వారు ఆరోగ్యంగా ఉంటారన్నా ఆలోచనతో తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన ఎన్నారై కేతినేని అన్వేష్ రూ.10వేల ఆర్థిక సాయంతో వాటర్ ఫ్రిజ్ అందించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న పిల్లలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపినట్లు అంగన్వాడీ టీచర్ తెలిపారు.

## గ్రామాల్లో వైద్యశిబిరాలు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** వర్షాకాలంలో సీజనల్ అంటు వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అవినాష్ తెలిపారు. తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జల్లేపల్లి, తెట్టెలపాడు, ఎర్రగడ్డ గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. గ్రామాల్లో ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిఒక్కరూ తమ నివాసంలో వర్షపు నీరు నిల్వ లేకుండా నీటి కుళాయిలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని, దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధూప్‌సింగ్ హెచ్‌ఇఓ రమేష్, మనీషా, పంచాయతీ కార్యదర్శి మాధవి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## లక్ష్మమ్మ మృతికి సిపిఐ నివాళి



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని ఇల్లూరు సిపిఐ శాఖ కార్యదర్శి పతేపురపు సత్యం తల్లి లక్ష్మమ్మ శుక్రవారం అకాల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.ఎ.రహీం, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం వియం బంజర్ గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో అన్నపూర్ణ శుక్రవారం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీలు చేపట్టడం జరిగింది. అంగన్‌వాడి కేంద్రాలలో రిజిస్టర్లను, పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్న పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అలాగే వారికి అందించే పౌష్టికాహారం గురించి వారికి తెలియజేశారు. అంగన్వాడి కేంద్రాల్లో టీచర్లు సమయపాలన పాటించి ఎప్పుడు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో అన్నపూర్ణ అంగన్వాడి టీచర్ లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శిరీష అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## అమ్మ మాట.. అంగన్‌వాడి బాట



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు 4 శివాజీ నగర్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జయలక్ష్మి, సూపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ మణుగూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ కె. సుజాత, ఇ. భద్రమ్మ, ఆయాలు శోభ, లక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

## ఒప్పంద కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న వాచ్ మెన్, పేషంట్ కేర్, పారిశుద్ధ్య కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు అందించట్లేదని, తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ హాస్పిటల్ వర్కర్స్ యూ నియన్ గౌరవ అధ్యక్షులు తడికమళ్ళ యోబు ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వరరావుకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తడికమల్ల యోబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలల వేతనం పెండింగ్ పెట్టటం వల్లన కార్మికులు ఎలా బ్రతకాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది శ్రీనివాసరావు, యశోద, రమణ, లక్ష్మి, రమ్య, రవిపాల్గొన్నారు

## సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** బడి బాట కార్యక్రమంలో భాగంగా పాపకొల్లు ఎంపిపిఎస్ పాఠశాల నందు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జనరల్ సెక్రటరీ, గ్రామ పెద్దలు కొదుమూరి కోటేశ్వర రావు, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నవీన్ రాథోడ్, పాపాకొల్లు ఇంది రమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వెంకట నారాయణ, కొండెం వీరభద్రంలు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు అక్షరభ్యాసం చేయించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంపూర్ణ జ్యోతి, ఉపాధ్యాయులు హలవత్ నరసింహారావు, గుగులోత్ శ్యాంసుందర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రైతు సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మన్నె ఉషాశారద అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నర్సింహాపురం, బుచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో రైతు సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. నర్సింహాపురం రైతు సదస్సులో 109 దరఖాస్తులు, బుచ్చిరెడ్డిపాలెం రైతు సదస్సులో 50 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకరరెడ్డి, తలపురెడ్డి నాగిరెడ్డి, శీలం వెంకట్రామిరెడ్డి, ఆర్ఐలు ఎస్.రవికుమార్, బి. రాజశేఖర్, ఎస్‌ఓ జాన్‌దర్గా సాహెబ్, యుడిసి శిరీష, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది చందు, వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

# దాతల కోసం ఎదురుచూపు..!

**-మూడేళ్ల బాబుకి హైపర్ ఐజిఎం సిండ్రోమ్ వ్యాధి**
**-ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు**



**ప్రజాపక్షం/వైద్యవిభాగం:** హైపర్ ఐజిఎమ్ సిండ్రోమ్ అనేది అరుదైన ప్రాథమిక రోగనిరోధక శక్తి లోపం రుగ్మత. ఇది బి కణాలు ఐజిఎమ్ యాంటీబాడీలను ఉత్పత్తి చేయకుండా ఐజిజి, ఐజిఏ మరియు ఐజిఈ వంటి ఇతర యాంటీబాడీ తరగతులకు మారడంలో వైఫల్యం కలిగి ఉంటుంది. జన్యు ఉత్పరివర్తనాల వల్ల కలిగే ఈ లోపం రోగనిరోధక ప్రతి స్పందనలో రాజీపడటానికి మరియు ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం పెరగడానికి దారితీస్తుంది. ఈ వ్యాధి సోకిన కుమారుడికి రూ.లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించలేనని, దయగల దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. మధిర ప్రాంతంలోని బోనకల్ మండలం, కలకోట గ్రామానికి చెందిన షేక్ సుభాని, షేక్ ఆశా దంపతులకు అబ్దుల్లా అనే మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. పుట్టినప్పటి నుండి హైపర్ ఐజిఎమ్ సిండ్రోమ్‌తో బాధపడున్నప్పటికీ, ఇది ఫిబ్రవరి 2025లో కుడి మోకాలి వాపు కారణంగా ఆసుపత్రిలో చేరిన తర్వాత గుర్తించబడిందని తల్లిదండ్రులు తెలిపారు. దీంతో బాబుకి గ్యాస్ట్రోఇంటెస్టైన్ ఇన్ఫెక్షన్లు, చర్మ ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ సంబంధిత శోథ మరియు పల్మనరీ హైపోప్లి వంటి సమస్యలు, చర్మంపై మచ్చలు, కీళ్లనొప్పులు, కండరాల నొప్పులు మరియు రక్త స్రావం వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మెరుగైన వైద్యం అందించేందుకు బాబుకి హైదరాబాద్‌లోని హైదర్ నగర్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్‌హాస్పటల్‌లో వైద్యం చేయిస్తున్నారు. బర్త్‌రైట్‌లో మందులు ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు తల్లిదండ్రులు రూ.4.5 లక్షలు అప్పులు చేసి వైద్య ఖర్చులు చేశారు. రాబోయే కొద్ది రోజుల్లో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం బాబుకు రూ. 25 లక్షల అవసరం ఉంది. హైపర్ ఐజిఎమ్ సిండ్రోమ్‌తో అబ్దుల్లా అనేక అనారోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించి ఆదుకుంటే తన కుమారుడికి ఆపరేషన్ చేయించుకుంటానని ఆర్థిస్తున్నారు. సాయం చేయాలనే దాతలు 9010029591 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని చిన్నారి తండ్రి షేక్ సుభాని, తల్లి ఆశా విజ్ఞప్తి చేస్తున్నారు.

## సెల్‌ఫోన్ల రికవరీలో సిఈఐఆర్ పోర్టల్ ఎంతో కీలకం

**- రూ.నాలుగు లక్షల సెల్ ఫోన్లు రికవరీ**
**- బాధితులకు అందజేసిన అడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** చోరికి గురైనా, పోగోట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీచేయడంలో (సిఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ పోర్టల్ ఎంతో కిలకమని దీనిని ఉపయోగించి పోయిన మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి గుర్తించవచ్చని అడిషనల్ డిసిపి లాఅండ్ ఆడర్ ప్రసాద్‌రావు అన్నారు. ఈమేరకు వివరాలను శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు కమిషనరేటు పరిధిలోని వివిద ప్రాంతాల్లో చోరికి గురైన, పోగోట్టుకున్న సుమారు నాలుగు లక్షల రూపాయల విలువ చేసే పదమూడు సెల్ ఫోన్‌లను సిఈఐఆర్ ద్వారా గుర్తించి రికవరి చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. మొబైల్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే ఐటి సెల్ బృందం స్పందించి దానిని ట్రాక్ చేసి గుర్తించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 4483 మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు నమోదు కాగా వీటిలో 2276 ట్రాక్ చేసి రికవరి చేసినట్లు పెర్కొన్నారు. ప్రస్తుత జివన శైలిలో సెల్‌ఫోన్ అత్యంత కీలకమైన పరికరంగా మారిందన్నారు. సమాచారం తెలుసుకోవాలన్నా, నగుదు లావాదేవీలు జరపాలన్నా మొబైల్ ఫోన్‌పై ఆధారపడేంతగా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఫోన్ ఎక్కడైన పోగోట్టుకుంటే పరిస్థితి ఊహించటం కష్టమేనన్నారు. వాటిని గుర్తించడానికి పోలీసు యంత్రంగం ఇప్పటికే వివిధ రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తోందన్నారు. అందులో సిఈఐఆర్ ప్రధానమైందన్నారు. ఈ సదర్భంగా రికవరి చేసిన సుమారు రూ.4లక్షలు విలువ చేసే 13 మొబైల్ ఫోన్‌లను వాటి యజమానులకు అడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు అందజేశారు. సెల్‌ఫోన్ల రికవరిలో కీలకంగా వ్యవహరించిన ఐటి సిబ్బంవి ఎస్సై సత్యనారాయణ, టెక్నికల్ బృందాన్ని సిపి అదేశాల మేరకు అభినందనలు తెలియజేశారు.

## సాయిస్ఫూర్తిలో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో యన్‌ఎస్‌ఎస్ విభాగం, సాయిస్ఫూర్తి సేవా సమితి వారి సంయుక్తాధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సౌజన్యంతో శుక్రవారం రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిభిరంలో 85మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, వారి యొక్క రక్త నమూనా గుర్తించి వారి నుండి రక్తం సేకరించి భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, సత్తుపల్లి ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులు, టెక్నీషియన్ల పర్యవేక్షణలో క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు అవసరమైన అన్ని గ్రూపుల నమూనా రక్తం బ్లడ్ బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం, లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి ప్రతినిధులు రక్తదానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు పండ్లు, జ్యూస్ మొదలగు వాటిని పంపిణీ చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశిష్ట అతిధి, ప్రెసిడెంట్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం డాక్టర్ వి చంద్రమోహన్, లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి లయన్,అధ్యక్షులు పెనుగొండ రమేష్, లయన్ దాసరి ఉమా మహేశ్వర బాబు కార్యదర్శి, లయన్ గోగడ రమేష్ కోశాధికారి, దారా నరసింహరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సియస్‌ఈ విభాగాధిపతి డా.షేక్ యాకూబ్, కళాశాల (ఎన్.ఎస్.ఎస్) ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధికారి బలుసుపాటి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తుపై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు ప్రజలు ఎలా రక్షించుకోవాలో ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం కమాండర్ గౌతమ్ రాకాసి తండా ప్రజలకు అవగాహన కల్పించారు. గత సంవత్సరం సెప్టెంబర్ వారంలో వచ్చిన భారీ వర్షాలకు తిరుమలాయపాలెం మండల పరిధిలోని రాకాసి తండాతో పాటు పలు గ్రామాల్లో బిటి రోడ్లు, సిసి రోడ్లు, చెరువు కట్టలు, ఇండ్లు, పంటలు, పశు సంపదకు తీవ్ర నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. భారీ వరదలు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మీ వద్ద ఉన్న వనరులతో ఎలా ప్రాణాలు రక్షించుకోవాలో సిపిఆర్ ఎలా ఉపయోగించాలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. గతంలో వచ్చిన ఆకేరు వరదలకు రాకాసి తండా ప్రజలు ఇండ్లపైకి ఎక్కి ప్రజలు తమ ప్రాణాలు రక్షించాలని సెల్ఫోన్ల ద్వారా సమాచారం అందివ్వగా వెంటనే స్పందించి అధికారులు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి వరదలో చిక్కుకున్న ప్రజలను కాపాడినట్లు తెలిపారు. వరదలు వచ్చినప్పుడు ప్రజలు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని ప్రకృతి విలయాన్ని ముందుగానే మనిషి ఊహించలేడని వారు తెలిపారు. విపత్తు సంభవించినప్పుడే ఆరాటపడకుండా ముందుగానే జాగ్రత్త పడితే ప్రాణ ఆస్తి నష్టాలు నివాంచుకోవచ్చనని అవగాహన కల్పించారు. ముందుగానే ఆకేరు వరద ఉధృతి పరిశీలించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మూగ జీవాలను విలువైన వస్తువులను జాగ్రత్తపర్చకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లల్లో పుస్తకాల దందా..!





**-యూనిఫాం, బెల్టుల పేరుతోనూ దోపిడీ**
**-పాఠశాలలోనే కొనాలంటూ నిబంధన**



**ప్రజాపక్షం/కారేపల్లి :** తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఒకే ఒక్క ఆశ కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు ఆదాయం తెచ్చి పెడుతోంది. తల్లిదండ్రుల నుండి పాఠశాల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నాయి. ఆడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్ కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు నోటు పుస్తకాలు యూనిఫారం షూస్ టీ షర్ట్ అంటూ అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి, దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఈవో కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయాల్లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూస్ ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీర్చాల్సిందేనంటూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో తప్పక అడిగిన డబ్బులు చెల్లించి షాపుల్లో మాదిరిగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లి దండ్రులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. మౌలిక వసతులు లేమి విద్యార్థులకు సరిపడా ఆట స్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. పరిశుభ్రమైన టాయిలెట్స్ లేవు అయినప్పటికీ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడి అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాల ధరలు రూ 280 నుండి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా గరిష్ఠంగా రూ 1500 మించి ఉండదు. అన్నీ కలిపి పదో తరగతికి కూడా రూ 2వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకే రూ 3వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. పెద్ద తరగతులకు రూ 5వేల నుండి 12వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, ఇతర సామాగ్రి విక్రయాలపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించినప్పుడు మాత్రమే నామమాత్రంగా అధికారులు వెళ్లి చర్యలు తీసుకుంటున్నారు. అంతే తప్ప దోపిడీని అరికట్టే చర్యలు మాత్రం జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు.

## రైతుల ముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు





**ప్రజాపక్షం/ములకలపల్లి:** వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతుల ముంగిట్లోకి వచ్చారని డిఏవో బాబు రావు అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట శాస్త్రవేత్తల బృందం డా పి నీలిమ, కే కోటేశ్వర్ ములకలపల్లి మండలంలోని జగన్నాధపురం గ్రామంలో గల రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ముగింపు రోజు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గత 45 రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట క్లస్టర్‌లో దాదాపు 66 గ్రామాల్లో 66 కార్యక్రమాలను నిర్వహించి రైతులకు ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, ఆయిల్ ఫామ్ గురించి సాంకేతిక విజ్ఞానాన్ని, నైపుణ్యాలను తెలియజేసేందుకు శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి కిషోర్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ అందించేటువంటి రాయితీల గురించి వివరించారు. ఆయిల్ ఫామ్ మునగ సాగు, టిష్యూ కల్చర్ అరటి సాగు సంబంధించిన రాయితీల గురించి తెలిపారు. అనంతరం వ్యవసాయ కళాశాల మృత్తిక శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ భూ సార పరీక్ష కోసం మట్టి నమూనా సేకరణ గురించి, భూసార పరీక్ష యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. అదే విధంగా డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మొక్క జొన్నలో విత్తనోత్పత్తి గురించి వివరించారు. ఆ తర్వాత డా శీరిష విస్తరణ విభాగం నుండి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రస్తావించినటువంటి అంశాల గురించి నేర్చుకొని తోటి రైతులతో పంచుకొని రానున్న పంటకాలలో పాటించడం వల్ల రైతులందరూ సుస్థిర వ్యవసాయం చేపట్ట వచ్చిన తెలిపారు. అనంతరం ఉద్యాన విభాగ శాస్త్రేవత్త డాక్టర్ పి నీలిమ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్‌లో అంతర పంటల సాగు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ మండల అధికారి అరుణ్, స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, 360 మంది రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, వ్యవసాయ కళాశాల బోధన సిబ్బంది, జన్నాధపురం గ్రామంలోని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 26న జరుగు సిపిఐ మణుగూరు మండల, పట్టణ మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 26 వ తేదీన జరుగు సిపిఐ మణుగూరు మండల, పట్టణ మహాసభ ను విజయవంతం చేయాలని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి లు పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయనగర్ గ్రామం లో జరిగిన సీపీఐ శాఖ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలలో నెలకొనివున్న సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఈ నెల 26వ తేదీన గురువారం మణుగూరు మండల, పట్టణ మహాసభ కిన్నెర కల్యాణ మండలంలో నిర్వహించ నున్నమని ఈ మహాసభ లకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య, జిల్లా నాయకులు హాజరు కానున్నారని, మండల మహాసభను విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోసిపిఐ నాయకులు ఆదర్ల రాములు, వంగ రాములు, నాగేశ్వరరావు, సుశీల, రేణుక లు పాల్గొన్నారు.

## అంగన్వాడీ అమ్మ ఒడిలాంటిది





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అంగన్వాడీ అమ్మ ఒడిలాంటిదని బూర్గంపాడు సిడిపివో రేవంతి అన్నారు. శుక్రవారం బూర్గంపాడు ప్రాజెక్ట్ పరిధిలోని భాస్కర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట, అంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరు అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేయించాలని తల్లిదండ్రులకు తెలిపారు. పిల్లల ఎదుగుదల అంగన్వాడీతోనే ప్రారంభం అవుతుందని, అంగన్వాడీ పిల్లల విద్యకు మొదటి అడుగు వేస్తుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్నాయని, పెరటి తోటలు పచ్చదనంతో నిండి ఉన్నాయని తెలిపారు. 5 సంవత్సరాలు నిండిన ప్రభుత్వ పాఠశాలకి వెళ్లే పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యా బోధన అందిస్తున్న విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, అంగన్వాడి కేంద్రాల శుభ్రంగా ఉంచుకోవడం జరుగుతుందన్నారు. ఈరోజే మీ పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని తెలిపారు. అనంతరం పోషణ వాటికలో భాగంగా కూరల విత్తనాలు, మునగ, కరివేపాకు మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ సక్కుబాయి, అంగన్వాడీ టీచర్లు భారతి, రమణ, అరుణ, క్రిష్ణవేణి, బాలమ్మ, లాలమ్మ, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధనతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్య చందన అన్నారు. శుక్రవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అయినపాలెం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా పిఎం శ్రీ తరగతి గదిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె, విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈసందర్భంగా అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా జీ సత్యవతి పని చేస్తూ ఇటీవల పదవి విరమణ పొందారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేస్తూ పాఠశాలను అభివృద్ధి పథకంలో నడిపిందని అడిషనల్ కలెక్టర్‌తో పాటు డీఈఓతో పాటు పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ సైదులు, ఏఎంఓ నాగ రాజశేఖర్, ఎంపీడీవో అశోక్, సత్యనారాయణ, హెచ్‌ఎం సావిత్రి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఎక్సలెంట్ పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్ష శిక్షణ

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నవోదయ ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల అయిందని జూలూరుపాడు సాయి ఎక్సలెంట్ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా 202425 సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్ష శిక్షణ కోసం జూలూరుపాడు మండల కేంద్రంలోని సాయి ఎక్సలెంట్ పాఠశాలలో అత్యంత అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో తక్కువ సమయంలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, జూలై 18 నుండి తరగతులు ప్రారంభం అవుతాయని, ఈ ప్రవేశ పరీక్షలో సీట్లు సాధించిన వారికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్నివివరాలకు 9441700094, 9440296832ను సంప్రదించాలనిపేర్కొన్నారు.

## విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** బడిబాట కార్యక్రమంలో భాగంగా చొప్పకట్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బనిగండ్లపాడు బిసి కాలనీ ప్రాథమిక పాఠశాల నందు శుక్రవారం నూతనంగా చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా 20మంది విద్యార్థులను నూతనంగా పాఠశాలలో చేరారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభోధన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సూపర్వైజర్ సరిత, కేర్ హాస్పటల్ ఎండి జంగా ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామదీపికలు, ఆదర్శ పాఠశాల చైర్మన్ పుల్లమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పని చేసే కార్యకర్తలకు గుర్తింపు



**-ప్రజాభిమానం ఉంటే పదవులు దక్కుతాయి**
**-స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి**
**-కుల గణన దేశానికి ఆదర్శం**
**-కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీలో కష్ట పడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజాభిమానం చూరగొంటే పదవులు అవే వస్తాయని మంత్రి తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం రఘునాథపాలెం బైపాస్ రోడ్డులోని మానుకొండ రాధాకిషోర్ పామాయిల్ తోటలో నిర్వహించారు. మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో కుల గణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కుల గణనతో పాటు ఎస్సి వర్గీకరణ కూడా చేపట్టామన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాధికారంలో ఉద్యోగ కల్పనలో అవకాశాలు కల్పించేందుకు వీలుంటుందన్నారు. తెలంగాణలో చేపట్టిన కుల గణన ఆదర్శంగా తీసుకుని దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టేందుకు కేంద్రంలోని ప్రధాని మోడీ కూడా సిద్ధమయ్యారన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశ మంతా రూ. 70వేల కోట్ల రుణమాఫీ చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ సారధ్యంలో తెలంగాణ రాష్ట్రంలో రూ. 21వేల కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ఇప్పటి వరకు రూ. 36వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం



అందరూ ఐకమత్యంగా కష్టపడి పనిచేయాలని తెలిపారు. అధికార పార్టీకి చెందిన వారే సర్పంచులు, ఎంపిటిసిలు అయితే ఆ గ్రామాభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరతాయన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రజల్లో మమేకమై వారి అభిమానాన్ని చూరగొంటే పదవులు అవే వస్తాయని తెలిపారు. తాను మంత్రినైనా మీలో ఒకడినేనని ఎప్పుడు పిలిచినా మీ గ్రామాలకు వస్తానని తెలిపారు. నా గెలుపు కోసం పనిచేసిన మీరు పదవుల్లో కూర్చోవాలన్నదే నా ఆశ అన్నారు. రఘునాథపాలెం మండలాన్ని రూ. 500 కోట్లతో అభివృద్ధి చేశానని మరో రూ. 500 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందాలని ఆ విధంగా గ్రామ స్థాయిలోని కమిటీలు కృషి చేయాలన్నారు. ఖమ్మం ప్రశాంతతను చూసి ఇతర రాష్ట్రాలు, జిల్లాల వారు కూడా ఖమ్మంలో ఇల్లు కట్టుకుని నివసించాలనుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌కు పోటీగా ఖమ్మం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో నాయకుల మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని సరి చేసుకోవాలని మంత్రి తెలిపారు. త్వరలో గ్రామ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో గ్రామాల వారీగా నాయకులతో మాట్లాడించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సాధురమేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం రైతు భరోసాను వెంటనే అందించాలి

**సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** వానాకాలం రైతుభరోసా నిధులు వెంటనే రైతుల బ్యాకు ఖాతాల్లో జమచేయాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి మండల పరిదిలోని అంజనాపురం గ్రామంలో సిపిఐ గ్రామశాఖ మహాసభకు హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో రైతుభరోసాకింద ఎకరానికి రూ 15 వేలు ఇస్తామని తరువాత మాటామార్చి రూ 12 వేలు చేసిందని అవికూడా 2024లో ఒక దఫా పూర్తిగా అన్నారని అవికూడా నాలుగు ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇచ్చిందని అన్నారు. అందరికి ఇవ్వలేదని ఆరోపించారు. ఈసంవత్సరం అయినా పరిమితిలేకుండా పంటలు వేసే ప్రతిరైతుకు పెట్టుబడి సాయం కింద నిధులు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వానాకాలం సీజన్ ప్రారంభం అయిందని విత్తనాలు కొనడానికి ప్రయివేటు వడ్డీ వ్యాపారస్తులవద్ద అధిక వడ్డీలు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సొంత స్థలాలు లేనివారికి స్థలాలు కొని ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అంజనాపురం గ్రామశాఖ కార్యదర్శిగా బాణోత్ రమేష్, సహాయ కార్యదర్శిగా నల్లమోతు శ్రీను, గుబ్బగుర్తి కార్యదర్శిగా దొబ్బనబోయిన వెంకటనర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బండారు వెంకన్న, మద్దిన్ని కోటేశ్వరరావు, చల్లగుండ్ల మురళి, నల్లమోతు పిచ్చయ్య, దొబ్బనబోయిన శేషయ్య, స్వచ్ఛ శ్రీనివాసరావు, రామనబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మండలంలోని నిధానపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే 50మంది విద్యార్థులకు రూ.20వేలు విలువచేసే స్కూల్ బ్యాగులు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామాగ్రిని పాఠశాల హెచ్ఎం సూర్యదేవర శివరామకృష్ణ ఆర్థిక సహాయంతో ఉచితంగా పంపిణీ చేయటం జరిగింది. గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాలలో అందించే ఉచిత సౌకర్యాలు ఉపయోగించుకుని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని , ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తూమాటి కృష్ణారెడ్డి, దోరెడ్ల కవిత, వాలంటీర్ షేక్ అమీరున్నిసాబేగం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అనుబంధ నాయిబ్రాహ్మణ సంఘం కమిటీల ఎన్నిక



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని కాంగ్రెస్ అనుబంధం నాయిబ్రాహ్మణ కమిటీల ఎన్నిక శుక్రవారం సాయిబాబా మందిరం ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. కాంగ్రెస్ నాయిబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘ కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు గజ్జల వెంకన్నతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవ సలహాదారులు కుదురుపాక శ్రీహరి, జిల్లా అధ్యక్షులు మాధవరావు, హరినాథ్, జిల్లా సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు తుమ్మల నాగభూషణం వారితో పాటు మధిర మండల అధ్యక్షులు సత్యనారాయణ వారితో లింగంపల్లి అప్పారావు వారితో పాటు కాంగ్రెస్ పార్టీ టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శీలం వెంకటనర్సిరెడ్డి, దార్న రాజశేఖర్, కట్ల నాగరాజు, బొగ్గుల శ్రీనివాసరావు, రచ్చబట్ట రామకృష్ణ తదితరులు పాల్గొన్రాడు. వైరా పట్టణ కమిటీ అధ్యక్షులు కేవతవరపు నారాయణరావు, కార్యదర్శి మంచికంటి అప్పారావు ఉపాధ్యక్షులు మురళి, కోశాధికారి సతీష్‌తో పాటు పాలూరు కార్యవర్గ సభ్యులు, అదేవిధంగా మండల కమిటీ మహిళా కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు నాయిబ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు గురించి మాట్లాడితే సహించేది లేదు



**ప్రజాపక్షం/వైరా:** కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన కమీషన్ ముందు హాజరైన కెసిఆర్ హాజరు కావడానికి ముందు కెటిఆర్ మాట్లాడుతూ తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు గురించి మాట్లాడిన విధానాన్ని ఖండిస్తున్నామని తెలుగుదేశం వైరా నియోజకవర్గ బాధ్యులు చెరుకూరి చలపతిరావు, కిలారు సురేందర్, బొల్లేపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మిమ్మల్ని తిరస్కరించిన ఇంకా మీలో మార్పు రాలేదని ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారని మరల ఎప్పుడైనా తెలుగుదేశం పార్టీని గురించి మా నాయకుడి గురించి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పమ్మిఅర్జున్‌రావు, మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరు వెంకటేశ్వరరావు, మద్దినేని రమణ, చింతల శ్రీనివాసరావు, రాచబంటి కృష్ణయ్య, కట్టా నర్సింహారావు, పాసంగులపాటి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## సోమవరం పల్లెదవాఖానాలో టిబి ముక్త్ భారత్ అభియాన్



**ప్రజాపక్షం/వైరా:** వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సోమవరం గ్రామం పల్లె దవాఖానా నందు ఇంటెన్సిఫైడ్ టిబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతి భాయ్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కళావతి భాయ్ మాట్లాడుతూ 100 రోజులు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు మాట్లాడుతూ టిబి లక్షణాలు, టిబి పరీక్ష యొక్క అవసరం వివరంగా గ్రామ ప్రజలకు తెలియజేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ వలనరబుల్ పాపులేషన్ గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మార్కొబాబు, టిబి సూపర్‌వైజర్ ఇమామ్, ఏఎన్ఎం శ్రీలత, పలువురు హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

## అసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎన్‌సిడి ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం బోనకల్ పిహెచ్‌సి, ముష్టికుంట్లలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రిజిష్టార్లను, రికార్డులను పరిశీలించి మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాన్సర్ బాధితురాలితో సంభాషించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, ఎంపిహెచ్ఓ దానయ్య, డాక్టర్ సాయిప్రియాంక, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు వేదికకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండలంలోని చిన్న బీరవల్లి రైతు వేదికకు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మందడపు సత్యనారాయణ, సామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మందడపు వెంకటేశ్వర్లు, వీరభద్రం వాటర్ ప్యూరిఫైయర్‌ను శుక్రవారం వితరణగా అందచేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్‌సాహెబ్, వెంకట్రావు, చావ కృష్ణారావు, గత్తము బాలరాజు, మన్నెపల్లి వెంకటేశ్వర్లు, పున్నారావు, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్ పాఠశాలలో పండుగలా విద్యాభ్యాసం చేయించిన ఉపాధ్యాయుడు



**ప్రజాపక్షం/వైరా:** దుమ్ముగూడెం మండలంలో బడిబాటలో భాగంగా ఎంపిపిఎస్ లక్ష్మీ నగరం పాఠశాల నందు నూతనంగా చేరిన ఒకటో తరగతి విద్యార్థులకు పాఠశాలలో రంగురంగుల పువ్వులతో ఆకుపచ్చ తోరణాలతో అలంకరించబడిన సరస్వతి దేవి ఆవరణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరపబడింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో చేరిన విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు, వ్రాత పుస్తకాలు, వర్క్‌బుక్‌లు, యూనిఫామ్, ఉచిత భోజన సౌకర్యంతో పాటు సహజ సిద్ధమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మేము కృషి చేస్తామని అన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ బడిలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశం పొందడంలో గ్రామస్థుల కృషి మరువలేనిది అని అన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రామస్థులకు స్వీట్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు టి.హైమావతి, ఏఎన్ఎం దుర్గాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది, భవిత సెంటర్ సిబ్బంది, గ్రామ యువకులు, విద్యార్థుల తల్లితండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏజెన్సీలో మెరుగైన వైద్యసేవలు అందించాలి



**- సమన్వయం చేయాల్సిన బాధ్యత మెడికల్ ఆఫీసర్లదే**
**- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని, అన్ని రకాల వైద్య పరీక్షలు చేయిస్తూ సిబ్బందిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సంబందిత మెడికల్ ఆఫీసర్లదే అని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో ఏజెన్సీ ఏరియాలోని 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని గ్రామాల్లోని కుటుంబాల గిరిజనులు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సిబ్బంది ఇంటింటికీ తిరిగి గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకు ఏఎన్ఎంలు,అశావర్కర్లు సమన్వయంతో ఎప్పటికప్పుడు గర్భిణీలకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో సహాజ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు ఎట్టి పరిస్థితుల్లో వారని పంపొద్దని ఆదేశించారు. రానున్న మూడు మాసాల్లో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అనునిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వర్షాకాలంలో చర్ల, దుమ్ముగూడెం, సింగరేణి, కారేపల్లి మండలాల్లో దోమల బెడద అధికంగా ఉంటుందని, వైద్య సిబ్బంది గ్రామపంచాయితీ వారి సహకారంతో ఇంటింటికీ శానిటేషన్ చేయించాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉండకుంచా చూడాలని, పిహెచ్‌సీల పరిధిలోని జ్వరాలతో బాధపడుతున్న రోగులను గుర్తించి జాగ్రత్తలు తీసుకుని ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ చేయించాలన్నారు. ప్రసవం కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల మహిళల పట్ల ఏరియా ఆస్పత్రి సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుని ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర చైతన్య, ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకుడు ముదిగొండ రామకృష్ణ, వైద్యులు జయలక్ష్మీ, మధువరన్, పుల్లారెడ్డి, తేజశ్రీ, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండాను అంతం చేయడం ఎవరి తరంకాదు




**సిపిఐ కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అమరల చిందించిన రక్తం నుండి పుట్టిన ఎర్రజెండాను అర్థం చేయడం ఎవరి తరం కాదని సిపిఐ కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం భైరవునిపల్లి గ్రామంలో కనకబండి సీతారాములు ఇంటి వద్ద పొలంపల్లి నారాయణ అధ్యక్షతన సిపిఐ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎర్ర జెండా ను అంతం చేస్తామని యితర పార్టీ నాయకులు అన్నారు. ఈ రోజు వాల్ల పార్టీ స్థితి గతులు ఏమయ్యాయో ఆలోచించుకోవాలి అని సూచించారు. ఎప్పుడైనా వాపును చూసి బలుపు అనుకోవద్దని రాజకీయంలో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు ఉండరని తెలిపారు. పార్టీ అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజలలో మమేకమై ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వాళ్లు ప్రజల్లో ఉంటారని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థ ఎన్నికలలో మన పార్టీ పోటీలో ఉంటుందని మరల సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేది మనమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా మన పార్టీ ప్రజా సంఘాలను కూడా నిర్మాణం చేసుకొని ప్రజల్లో మమేకమై ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని కోరారు. అనంతరం గ్రామ సిపిఐ శాఖ కార్యదర్శిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, సహాయ కార్యదర్శి లాగా భద్రాజీ వేంకటేశ్వరరావు, బాలెబోయిన వేంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారి తో పాటు 15 మందితో కూడిన కార్యవర్గం ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ గ్రామ శాఖ సభ్యులు కనకబండి రామయ్య, మరికంటి రాములు, ఆలేటి మహేష్, కుంచం భిక్షం, చుట్టూ వెంకన్న, ముత్యాల వేంకటేశ్వర్లు, చిలివేరు రేణుబాబు బోమ్మ అంతయ్య, పెద్దపాక నాగరాజు, మాతంగి అన్వేష్ పాల్గొన్నారు.

# జిల్లాలో రూ.50 లక్షలతో భవిత కేంద్రాలను సుందరీకరిస్తాం



**-జిల్లాలో 59 పాఠశాలలో**
**ఇంకా పిల్లలు చేరని పాఠశాలలు ఉన్నాయి**
**-పాఠశాలలను తనీఖీ చేసిన సీఎంఒ వై.రాజశేఖర్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో ఉన్న భవిత కేంద్రాలను సుందరీకరణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు సీఎంవో వై.రాజశేఖర్ అన్నారు. మండలం లోని మండ్రాజుపల్లి, నేలకొండపల్లి, బోదులబండ ప్రభుత్వ పాఠశాలలు, సింగారెడ్డిపాలెం లోని భవిత కేంద్రం ను శుక్రవారం తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి ని పరిశీలించారు. బడిబాట కార్యక్రమం గురించి స్థానిక ఉపాధ్యాయుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల తో మాట్లాడారు. జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉండగా వాటిలో 8 మండలాలలో పక్కా భవనాలు ఉన్నట్లు తెలిపారు. పక్కా భవనాల మరమ్మతులకు రూ.50 లక్షలతో చేపటనున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాలు ఉండగా వాటిలో 8 మండలాలలో పక్కా భవనాలు ఉన్నట్లు తెలిపారు. పక్కా భవనాల మరమ్మతులకు రూ.50 లక్షలతో చేపట్టనున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగుల కు ఇంటి వద్ద నుంచి కేంద్రాల కు తీసుకరావటం, తీసుకపోవటం కోసం ప్రత్యేక వాహానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా డేటా కోసం సర్వే చేస్తున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాలకు మెటిరియలన్ చేర్చినట్లు తెలిపారు. కేంద్రాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రాలలో పని చేసే ఐఈఆర్పీ మొత్తం 42 మందికి గాను. 13 మంది మాత్రమే ఉన్నారనిమిగతా ఖాళీలను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఫిజియోథెరీఫీ కి అవసరమైన వైద్యులను కూడ నియమించినట్లు పేర్కొన్నారు. బడి బాట ద్వారా 1216 పాఠశాలలో ఇప్పటి వరకు 3,985 మంది విద్యార్థులను చేర్పించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 59 పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడ చేరని పాఠశాలలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటిలో 10 పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక కార్యచరణ ను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్య, భోజనం ను అందించటమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.కార్యక్రమంలో ఎంఈఓ బాలిన చలపతిరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తొర్తి గురవయ్య పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమాలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోరకు క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు టీడీ జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య పేర్కోన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కోరకు అందించే ఉపకరణాల కు సంబంధించిన జీవో 89 లో కొన్ని మార్పులు చేయాలని కోరారు. దీని వలన దివ్యాంగులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఉపకరణాల కోసం వివిధ సర్టిఫికెట్లు అడుగుతున్నారని అన్నారు. దివ్యాంగులు లాయర్ అఫిడవిట్ తీసుకోవటం చాలా కష్టంగా ఉందని అన్నారు. ఆధార్కార్డు, సదరం సర్టిఫికెట్ ను కొలమానం గా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు టీడీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# ఇష్టంతో చదివితే అద్భుత ఫలితాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** విద్యార్థిదశలో శ్రద్ధగా ఇష్టపడి చదివితే జీవితాలు అద్భుతంగా ఫలితాలతో తీర్చిదిద్దబడతాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఐటిడిఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్ఓఇ, ఇఓఇ కిన్నెరసాని, భద్రాచలం, ఖమ్మం కాలేజీల్లో ఇంటర్ చదువుతూ విద్యార్థినీ విద్యార్థులు జేఇఇ అడ్వాన్స్ మెయిన్ పరీక్షలు రాసి ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి ఐఐటి, ఎవఐటి, ఐఐఐటిలలో సీటుల సాధించి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారని, ఇదే స్పూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా శుక్రవారం తన ఛాంబర్లో ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపకుల సమక్ష్యంలో శాలువాలు కప్పి సత్కరించి మెమోంటోలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఆర్‌సిఓ అరుణ కుమారి, ఎస్ఓఇ కళాశాల ప్రధానాచార్యులు బాలస్వామి, సిఓఇ కళాశాల ప్రధానాచార్యులు పద్మావతి, రమేష్, అధ్యాపకులు నర్సింహారావు, శ్రీనివాస్,చారి,సత్యనారాయణ, రమేష్, కేశవరావుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ కాన్వేయన్స్ డ్రైవర్లకు సంబంధించిన సీఎంపీఎఫ్ బాపతు 15 హడక్కు పేమెంటు క్రింద కటింగ్ ఐనా డబ్బుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, రెండు నెలల బిల్లులు చేయకుండా పెండింగ్ లో పెట్టిన వాటిని వెంటనే క్లియర్ చేయాలని,గత మూడు సంవత్సరాల నుండి కటింగ్ అవుతున్న సీఎంపిఎఫ్ వివరాలను తక్షణమే డ్రైవర్లకు తెలియపరచాలని తదితర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యూ కిష్టాఫర్ లు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ లో సింగరేణి ప్రైవేటు కాన్వేయన్స్ డ్రైవర్ల సమావేశాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.సింగరేణిలో చూడడానికి ఏసీ కార్లలో పని చేస్తున్నప్పటికీ చట్టబద్ధంగా రావలసిన వేతనాలు కానీ, సౌకర్యాలు కానీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా ఏడవ తేదీ లోపు చెల్లించవలసిన వేతనాలు 15వ తేదీ తరువాతనే చెల్లిస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రైవేటు కాన్వేయన్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టే కార్యక్రమాలలో డ్రైవర్లు అందరూ ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాపు శ్రీను, రవి కుమార్, షరీఫ్, ఏ.లక్ష్మి నారాయణ, రాంకి, సాగర్, రాజు, వంశీ, వెంకట్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులపై అధికారుల కొరడా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం పట్టణ పరిధిలోని రైతు బజార్ ఏరియాలో అనేక సంవత్సరాలనుండి కూరగాయల వ్యాపారస్తులు దుకాణాల ను ఎ ర్పాటు చేసుకొని జీవినము సాగి స్తున్నారు. అయితే పజానాయకుడు, నియోజకవర్గం ప్రజల కష్ట, సుఖలలో అండగా ఉండే భారతకమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు గెలుపు తో మార్కెట్ లో ని చిరు వ్యా పారస్తు లకు నూతన మార్కెట్ ఎర్పాటు కు శ్రీకారం చుట్టారు. సంబందిత మునిసిపల్ అదికారుల పర్యవేక్షణలో జరుగుతున్న మార్కెట్ భవన నిర్మాణాన్ని సింగరేణి అదికారులు అడ్డుకుంటూ,అక్రమంగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పనులు మొదలుపెట్టారు అనడం వీడ్డురంగా ఉన్నదీ. ఈ స్థలము సింగరేణిది అనే బోర్డు ఎర్పాటు చేయడానికి ఎస్టేట్ సెక్యూరిటీ సిబ్బంధి వెళ్లగా వ్యాపారస్తులు అడ్డుకొన్నారు. తమ నాయకుడు స్థానిక ఎమ్మెల్యే తో మాట్లాడతామని, వ్యాపారస్తుల నాయకులు చెప్పాగా అదికారులు వెనుదేరిగారు. ఎండా, వాన, చలి, లాంటి వాటీని లెక్కచేయకుండా పొట్ట కూటి కొరకు కష్ట పడే నిరుపె దల పై అది కారుల జులుం ఎందుకు అని పలువురు పట్టణ వాసులు సైతం చర్చించుకొంటున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయుసి, నాయకులు కూరగాయల వ్యాపారస్థులు, అదీక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలపై ఎమ్మెల్యే జారేకు వినతి



**ప్రజాపక్షం/దమ్మపేటః** మా కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలం సిపిఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో 2017 వ సంవత్సరంలో ఎంపీడీవో ఆఫీస్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో ఎన్నో పోరాటాలు చేసి కేసులు పెట్టించుకుని గుడిసెలు ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని, ఎండనక, వాననక చంటి బిడ్డలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇంటి నెంబర్లు, మరుగుదొడ్లు, సిసి రోడ్డు, ఇందిరమ్మ ఇల్లు కావాలని మా కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జారేను క్యాంప్ ఆఫీసులో కలిసి సమస్యలు వివరించగా వారు వెంటనే స్పందించి అధికారులతో చరవాణిలో మాట్లాడి వెంటనే వీళ్ళ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. త్వరలోనే అధికారులు మీ కాలనీకి వచ్చి మీ సమస్యలు పరిష్కరిస్తారని ఎమ్మెల్యే జారే అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బత్తుల సాయి, దొంగ లక్ష్మీ నారాయణ, తిరుపతమ్మ, శేష కుమారి, కోటి అప్పమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆయన ఎక్కడ పనిచేసినా అంతే..!

**-పాఠశాల పురోభివృద్ధి, విద్యార్థుల ఉన్నతే లక్ష్యం**




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆయన ఎక్కడ పనిచేసినా ఆయనది ఒక్కటే లక్ష్యం. పాఠశాలను, పరిశుభ్రతలోనూ, విద్యాభివృద్ధిలోనూ, మౌలిక వసతుల కల్పన లోనూ అగ్రభాగాన నిలపడం. ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను విద్య సహా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ముందు వరుసలో నిలపడం. ఇప్పటి వరకు ఐదు పాఠశాలల్లో పని చేసిన ఆయన ఆ పాఠశాలలపై తనదైన ముద్ర వేయడమే కాకుండా ఆయా గ్రామాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదిం చుకున్నారు. ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఆ గ్రామాల ప్రజలు రాంమోహన్ గారు అని గుర్తు తెచ్చుకునే కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నతనం నుంచి




అభ్యుదయ భావాలతో పెరిగిన ఆయన ఉద్యోగ ధర్మంలోనూ అదే పాటిస్తూ ఉత్తమ ఉపాధ్యాయునిగా వినతికెక్కారు. తనికెళ్ల ప్రాథమిక పాఠశాలలో ఉపా ధ్యాయునిగా పనిచేస్తున్న వాసిరెడ్డి రాంమోహన్ తాను పనిచేస్తున్న పాఠశా లకు విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకోవడం వచ్చిన వారిని క్రమశిక్షణతో ఎదిగేలా చేయడం పైనే ఆయన దృష్టిసారించే వారు. కేవలం చదువుకే పరి మితం కాకుండా క్రీడా, సాంస్కృతిక రంగాల వైపు విద్యార్థులకు ప్రవేశం



కల్పించే వారు. తాను క్రీడాకారుడు కావడం కూడా ఆయనకు సాను కూల అంశంగా మారింది. ఇక పాఠ శాలలో వసతులు కల్పించడానికి తన సొంత ధనాన్ని వెచ్చించిన సం దర్భం కూడా లేకపోలేదు. మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా అన్ని జాగ్రత్తలు తీసుకునే వారు. ఆయన ఎక్కడ పనిచేసినా విద్యార్థులు వారి తల్లిదండ్రులు బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు చెప్పారంటే అతిశయోక్తి కాదు. పాఠశాల నుంచి బదిలీ అయి వెళ్లేటప్పుడు మా సారును బదిలీ చేయవ ద్దంటూ అడ్డు తిరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు తనికెళ్ల పాఠశా లలో పనిచేస్తున్న ఆయన గ్రామంలో బడిఈడు ఉన్న ప్రతి ఇంటికి తిరుగుతూ పిల్లలు బడికి వచ్చేలా చైతన్యపరుస్తున్నారు. ఒకరిద్దరు పిల్లలు లేక మూతపడు తున్న ప్రాథమిక పాఠశాలలో 35 మంది పిల్లలతో ప్రాథమిక పాఠశాల కళకళ లాడుతుంది. మోటార్ సైకిల్ సౌండ్ సిస్టంను అమర్చుకుని గ్రామంలో తిరుగుతూ పిల్లలను బడిలో చేర్చడానికి ఆయన చేస్తున్న ప్రయత్నం సర్వత్రా అభినందనలు అందుకుంటుంది. ఈ దిశగా మరి కొంత మంది ఉపాధ్యాయులు ప్రయత్నిస్తే ప్రభుత్వ విద్య పదిలమవుతుంది.

# ప్రమాదకరంగా వైరా రింగు రోడ్డు వద్ద గుంతలు..!

**-ఇలా ఉంటే ప్రయాణం ఎలా..?**
**-అధికారులకు గుంతలు కనిపించడం లేదా..?**
**-ప్రమాదాలకు నిలయంగా మారిన గుంతలు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా రింగు రోడ్డు వద్ద గత కొంతకాలంగా విపరీత మైన ట్రాఫిక్ రద్దీ కొనసాగుతుంది. ఇలాంటి సమయంలో రింగు రోడ్డు వద్ద పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారుతు న్నాయి. అసలే విపరీతమైన ట్రాఫిక్ ఆపై గుంటలు ఆ గుంటలతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరి గిద్దో అని ఆందోళన చెందుతున్న ప్రజలు, నిత్యం రింగు రోడ్డు కూడలి వద్ద పెద్ద ఎత్తున వాహనాలు వస్తూపోతూ ఉంటాయి. ఈ ప్రాంతంలో ఏర్పడిన గుంటలు అతి ప్రమాదకరంగా మారాయి. ఆ గుంటలను తప్పించడానికి వాహనదారులు పడరాని ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క గుంట మధ్య అడుగు దూరం లేకుండా గుంటలు ఏర్పడ్డాయి. ఆ గుంటలను వాహనాలు తప్పించబోయిన ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. గత రరెండు రోజుల క్రితం రింగు రోడ్డు వద్ద ఏ్పడిన గుంటలో లారీ రాత్రిపూట దిగుబడి ఆగిపోయింది. దీంతో ఆ డ్రైవర్ క్లీనర్ పడ్డ ఇబ్బందులు చెప్పలేనివి. అదే సమయంలో ద్విచక్ర వాహ నంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయిన క్రిందపడ్డారు. ప్రమాదవశాత్తు వారికి ఎలాంటి ప్రమాదం జరగలదు. పెద్ద ఎత్తున గుంటలు రింగు రోఉడ్డ వద్ద కని పిస్తూ ఉంటే సంబంధిత అధికారులు ఎక్కడున్నారు. అసలు కార్యాల యాలకు వస్తున్నారా విధి నిర్వహణలోనే ఉంటున్నారా అనేది కూడా ఇప్పుడు నోట చర్చగా మారింది. ఎందుకంటే నిత్యం కొన్నివేల మంది ప్రజలు ఈ రోడ్లపై తిరుగుతూ ఉన్నారు. అధికార యంత్రంగా రోడ్లపై తిరిగితే ఈ గుంటలు వాళ్లకి కనిపించే ఉంటాయి. వెంటనే గుంటలకు మరమ్మత్తు పనులు పూర్తిస్థాయిలో చేపట్టి ఉండేవారు. ఇటీవల కాలంలో ఈ రింగు రోడ్డు వద్ద ఏర్పడిన గుంటల వలన ఎన్నో ప్రమా దాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ప్రమాదాలకు నిలయంగా మారిన వైరా రింగు రోడ్డు వద్ద గుంటలను మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుకుంటున్నారు.

# వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి పోయి నీరు వృధాగా పోతుంది. ఈ విషయం అధికారులు తెలి సిన్పటికీ ఈ మాత్రం పట్టించుకోకపోవటం లేదని రైతులు ఆరోపి స్తున్నారు. వ్యవసాయ పనులు జరుగుతున్నా ఇంకా పైప్‌లైన్ బాగు చేయకపోవడం వలన తమ పొలాలకు శుభ్రం చేసుకుని పంట వేసుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పంట పొలాలకు వెళ్లే దారిలో నెలరోజుల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు వృధాగా పోతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

# లక్ష్మీపురం పాఠశాలలో అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరా భ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావర ణంలో నిర్వహించారు.ఈసందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు షేక్ కరామత్ అలీ మాట్లాడుతు ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించిందని పాఠశాలలు అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు విద్యను బోధిస్తారని విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సహోధ్యాపా యుడు దూరి జయరాజు, అంగన్‌వాడీ టీచర్ చింతపల్లి సువార్త, ఆయా బాణోత్ సుశీల, గ్రామ దీపికి గుగులోత్ లక్ష్మి , నరేష్, నరసింహారావు, అనూష, కాంతమ్మ, హుస్సేన్, మౌనిక, నీలమ్మ, చిలకమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి దందా..!

**-ప్రభుత్వాదాయానికి భారీగా గండి**
**-లక్షలు పోగేసుకుంటున్న మాఫియా**
**-అరికట్టాల్సిన అధికారులు ఆ వైపు చూడరు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అక్రమ మట్టి దందా చట్టవి రుద్ధంగా జరుగుతూ పర్యావరణాన్ని దెబ్బతీ స్తున్నా, భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడు తున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా శాఖాధి కారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు పర్యావరణవేత్తలు. అక్రమంగా మట్టిని తవ్వి, తరలిస్తూ, ప్రభుత్వానికి నష్టం కలుగ స్తున్న మట్టి మాఫియాకు రాజకీయ నాయకుల అం డ పుష్కలంగా ఉండటంతో మాఫియా ఆడిందే ఆట, పాడిందే పాటగా మరిందని ప్రతి పక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తు న్నారు. మట్టిని తవ్వడానికి అనుమతి లేకపోయినా, కొందరు మట్టిని తవ్వి, దానిని చట్టవిరుద్ధంగా ,టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసు కుంటున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోవటమే కాకుండా,పర్యావరణానికి హాని కలిగి,భూగర్భ జలాలు పడిపోయి, మూగ జీవాలు మాయమైపోతున్నాయి. మట్టి అక్రమ తోలకాలతో పచ్చని బీళ్ళు లోతట్టు ప్రాంతాలుగా మారుతున్నాయి. అనుభవం లేని డ్రైవర్లతో రోడ్లు నాశనమవుతున్నా యి. నిన్నటి వరకు చెరువు మట్టిని రైతుల పేరుతో వెంచర్లకు తరలించింది మాఫియా. భారీ వాహనాలు ప్రధాన సెంటర్లలో వాయు వేగంతో దూసుకుపోతుండటంతో వాహన దారులు,పాదాచారులకి తీవ్ర ఇబ్బందులు కలగటమే కాకుండా ,ట్రాఫిక్ కు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సుమారు 10 నుండి 15 టిప్పర్లు ఆంధ్రా నుండి సత్తుపల్లి పట్టణంలో తిరుగుతు న్నాయి.వాటికి అనుమతులు ఉన్నయా లేవా, వాటి కెపాసిటి ఎంత, మాఫియా తరలిస్తున్న మట్టి కెపాసిటి ఎంత అనేది రవాణా శాఖ చూడాల్సి ఉంటుంది కాని గత నెల రోజులుగా సామర్థ్యానికి మించి లోడింగ్ తో వాహనాలు తిరుగుతున్న రవాణా శాఖాధికారులు ఒక్క కేసు నమోదు చేయకపో వటం ఏమిటన్నది అం తు చిక్కని ప్రశ్నగా మారింది. రైతుల పేరుతో చెరువులలో మట్టిని భారీగా తరలించి వెంచర్లకు అమ్ముకుంటుంటే నీటిపారుదల శాఖాధికారులు కార్యాలయాలకే పరిమితమవ్వటం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. టిప్పర్ల వల్లన పట్టణంలోని ప్రధాన సెంటర్లైన కాకర్లపల్లి ,సిద్దారం రోడ్డు, రింగ్ సెంటర్, కల్లూరు రోడ్డు తదితర కూడళ్ళ వద్ద ఈ వాహనాల వల్లన ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతున్నా పోలీస్ శాఖ వాటి వైపు కన్నెత్తి చూడకపోవటం విస్మయాన్ని కలిగిస్తుంది.అదే విధంగా రెవిన్యూ భూములలో సైతం అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నా రెవిన్యూ శాఖ అధికారులు చోద్యం చూస్తుండటం గమనార్హం. పట్టణం, మండ లంలోని ప్రతి శాఖ లో మట్టి మాఫియా వేలు పెడుతూ అక్రమ సంపా దన సంపాదిస్తూ, జన సామాన్యానికి ఇబ్బందులు పెడుతూ, చట్టవిరు ద్ధమైన కార్యకలాపాలు జరుపుతున్నా రు. అనుమతి లేకుండా మట్టి తవ్వడాన్ని అరికట్టాలని, మట్టి మాఫియాకు కిందిస్థాయి రాజకీయ నాయకులు సహా య, సహకారాలు అందించకుండా చూడాలని, మట్టి మాఫియాపై ప్రజల్లో చైత న్యం కల్పించటంతో పాటు, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో ఆహ్లాదం వెల్లివిరియాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అంగన్వాడీ కేంద్రాలలో ఆహ్లాదం వెల్లివిరియాలని ఐసీడీ ఎస్ సీడీపీఓ జె.రత్నకుమారి సూచించారు. మండలంలోని చెరువుమాధారం అం గ న్వాడీ కేంద్రాలలో శుక్రవారం మొక్కలు జిల్లా నాటారు. అనంతరం కొత్తగా చేరిన వారికి అక్షరాభ్యాసం కార్యక్రమంను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డారు. అంగన్వాడీ కేంద్రాలలో ఆకు కూరలు, కూరగాయలు, ఆహ్లాదం పరిచే మొక్కలను నాటాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే వారికి పచ్చని తివాచీ స్వాగతం పలుకుతున్నట్లు పచ్చటి మొక్కలను పెంచాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపా రు. కేంద్రాలను ప్రతీ ఒక్కరూ సద్వినీ యోగం చేసుకోవాలని సూచించారు. అమ్మ మాట, అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కేంద్రాలలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 24 ఏళ్ల పిల్లలను కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. 5 ఏళ్ళు దాటిన వారిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పార్వతి, అంగన్వాడీ టీచర్స్ కోటేశ్వరీ, శారద, చిన్నారులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం కలెక్టరేట్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వైరా నుంచి కొబ్బరి బొండాల లోడుతో వస్తున్న అశోక్ లే ల్యాండ్ వాహనం కలెక్టరేట్ సమీపం లోని ప్రైవేటు స్కూల్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమా దంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.